# బ్లాక్ మెయిలర్

## పావనీ సుధాకర్

'మధూ!' – పులిక్కిపడి కళ్ళెత్తి చూసి గభాల్న లేచి నుంచుంది మధుమతి

"గుర్తుపట్టలేదా?" నవ్వుతోన్నాడతను భువనమోహనంగా

ఆ పెదాల కదలిక – చివర్న తిరిగే వొంపు

ఆ వొంపులో వొదిగిన ఆకర్షణ

చప్పున గుర్తొచ్చిందామెకి – ఆ నవ్వు కళ్యాణ్‌ది

అయితే – ఆ నవ్వు తాలూకు మనిషి – కళ్యాణ్ ఆశ్చర్యంగా – భయంగా కళ్ళు పెద్దవి చేస్తూ పైకే అనేసింది.

"అవును కళ్యాణ్‌నే – గుర్తొచ్చానన్నమాట కూర్చోనా?"... అంటూ కూర్చున్నాడు సోఫాలో.

వెడల్పాటి భుజాలూ, వొత్తయిన నొక్కుల జుట్టూ, మెరిసే కళ్ళూ, చురుక్కుమనిపించే చూపూ, ఆకాశంలోకి చూసే తిన్నని ముక్కూ, చక్కని నవ్వుతో నిండిన ఆకర్షణీయమైన పెదాలు – ఎంతో బావుంటాడతను – లెబానోను దేవదారు వృక్షంలా

ఆమె శిలలా శిల్పంలా అలా నుంచునే వుండిపోయింది.

"నాకు తెల్సు. నేను రావడం నీకు చాలా కష్టాన్ని కలిగిస్తుందని"

తల వెనక్కి వొంచి పైకి చూస్తూ అన్నాడతను.

ఆమె మౌనంగా అట్లానే ఉంది.

"ఏం! మాట్లాడవా?" తలదించి కళ్ళు పైకెత్తి ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు.

మధుమతి మొహం రాయిలా బిగుసుకుపోయింది. పెళ్ళయి ఎనిమిదేళ్ళు గడిచాయి. సంసారం స్వర్గంలా సంవత్సరాలు నెలల్లా దొర్లిపోతున్నాయ్.

పెళ్ళి నిన్న మొన్నైనట్లుగా భర్తతో ఈ జీవితం ఒక అద్భుతమైన కలలా తోస్తుంది ఆమెకి – ఇతన్ని పూర్తిగా మర్చే పోయింది.. ఇన్నేళ్ళ జీవితంలోనూ ఎందుకు పెళ్ళిచేసుకున్నానా! అనే పశ్చాత్తాపంకానీ, ఏదైనా కష్టం కలిగి మరో వ్యక్తిని తలచుకు బాధపడే అవసరం గానీ రాలేదు మధుమతికి. ఈ కల్యాణ్‌ని ఏనాడూ తలచుకున్న పాపాన పోలేదు. ఏనాడైతే తండ్రిమాట కాదన్లేక మరొకరి జీవితంలోకి అడుగుపెట్టిందో – అప్పుడే అతన్ని మర్చిపోవాలని నిశ్చయించుకుంది. పెళ్ళికాకముందు ఇతన్ని చేసుకోలేకపోతున్నానే అని బాధపడింది కానీ, పెళ్ళయ్యాక చిన్నగా గుర్తైనా రాలేదు. ఇప్పుడు తల్చుకుంటే అదంతా తెల్సీ తెలియనితనంగా అన్పిస్తుంది.

ఏనాటి జ్ఞాపకాలో ఇతనివి – అందుకే వెంటనే గుర్తుకూడా పట్టలేకపోయింది. కానీ, ఎందుకొచ్చినట్ట తను?

ఏం ఆశించివచ్చాడు – ఏం నష్టం చేద్దావని!

పోనీ ఏం లాభం పొందుదావని!

ఇవి రెండూ కాక – స్నేహంగానా?

ఏదీ నిర్ణయించుకోలేకపోతోంది –

'అంత భయపడతావెందుకు?" ఆమె ఆలోచన్లని అపుతూ, ఈజీగా అడిగాడు –

చివ్వున తలెత్తింది మధుమతి –

"ఇంకా ఆ అభిమానం అట్లానే ఉందన్నమాట" – కవ్వింపుగా అన్నాడు.

ఆమెకి వొళ్ళు మండింది.

ఏవిటితని వుద్దేశ్యం? ఏం అనుకుంటున్నాడు?

ఏ మట్టరికంతో వచ్చి కూచున్నాడు? ఏ సంబంధాల్ని తిరగతోడాలనుకుంటున్నాడు? ఆమెకి దాచుకోలేనంత కోపం వస్తోంది – అయినా లోపల్లోపల అణచుకుంటూ –

"ఇంతకీ ఏవిటి వచ్చినపని?" చాలా మామూలుగా అడిగింది.

"పనా?" గట్టిగా నవ్వాడు.

"పనుంటేనే వస్తారా? పోనీ రావాలా?" ప్రశ్నించాడు కనుబొమలు పైకి లేపి.

ఆమె మాట్లాడలేదు మళ్ళా.

"నువ్వూ నేనూ ఎంత ఇదిగా..." ఇంకా ఏదో చెప్పబోయాడు.

"ప్లీజ్ – స్టాపిట్ – అనవసరమైన విషయాలు మాట్లాడకు – నీ పరిధిలో నువ్వుండి – నీ స్థానం తెలుసుకుని మాట్లాడు" కఠినంగా, గట్టిగా అందామె అతను చెప్పబోయేది మధ్యలోనే కట్‌చేస్తూ.

అతడు ముందుగా కొంచెం షాకయ్యాడు. తర్వాత తేరుకున్నాడు.

ఒక్క క్షణం దానివైపు చూసింది. ఎంత బుద్ధిహీనంగా రాసిందీ వుత్తరాలు! అందులోనూ ఇలాంటి దరిద్రుడికి– ఎంతో విచారమన్పించిందామెకి. పాతాళంలోకి కుంగిపోతున్నట్టుగా వుంది. అంతట్లో వీధిలోంచి భర్త...

అవమానాన్ని జీర్ణించుకునే క్షణకాలంలోనూ అతని అందమైన మొహంలో వికృతమైన రంగులు నర్తించా యి. అయినా, సాదాగా వుండడానికి ప్రయత్నిస్తూ –

"సరే, నీతో నాకు గొడవెందుకు! నాక్కొంచెం డబ్బుకావాలి – ఎంతోకాదు – ఓ ఐదువేలు – ఇచ్చెయ్ – వెళ్ళిపోతాను" తాపీగా సోఫాలో వెనక్కి వాల్తూ అన్నాడు.

ఇట్లాంటిదేదో వూహిస్తూనే వుంది మధుమతి – కానీ ఇతడింతకి తెగించి, ఇట్లా డైరెక్ట్‌గా బ్లాక్ మెయిల్ చేస్తాడని అనుకోలేకపోయింది.

ఇన్నేసి సిన్మాలు చూసింది – నవల్లూ కథలూ చదివింది – పెద్దలుచెప్పిన సుద్దులు వింది – వాళ్ళకీ, వీళ్ళకీ జరిగిన అన్యాయాలు తెల్సు – చదివినదాన్ని, చూసినదాన్ని, విన్నదాన్ని, అర్థంచేసుకుని మంచిని గ్రహించే బుద్ధి వుంది.

అయినా ఎందరో స్త్రీలలాగా తనూ, ఎంతో తెలివిగలదనుకున్న తను కూడా తప్పటడుగు వేసింది.

ఈ ఆడవాళ్ళు ఎంత అమాయకంగా ప్రేమ విషయంలో మోసపోతారు!

ఇంతటి దుర్మార్గుణ్ణి ప్రేమించి, వాడికి ప్రేమ ఉత్తరాలు రాసి, వాణ్ణి పెళ్ళాడలేకపోతున్నానని వగచిన చవటన్నర చవట తను. ఇంతకంటే ఓటమి తన జీవితానికి ఏవుంది గనక– అలాగే ఆలోచించుకుంటూ నుంచుంది మధుమతి.

"ఆలస్యం ఎందుకు మధూ! మళ్ళా ఎవరొచ్చినా నీకు శ్రమ" వ్యంగ్యంగా అన్నాడు కళ్యాణ్.

ఒక్కసారి వులిక్కిపడింది మధుమతి – అయినా వులికిపాటును దాచుకుంటూ, "శ్రమేం వుంది? గానీ ఐదువేలు నేనెందుకివ్వాలి నీకు?" సూటిగా అడిగింది.

అతను తెల్లబోయాడు క్షణకాలం.

మళ్ళీ సర్దుకుని "మనం రాసుకున్న వుత్తరాలు ఇంకా అలాగే ఉన్నాయ్" చేతిలో వున్న ఫైలు తెరచి ముందుకు చాచాడు – పాతబడినా, నీట్‌గా ఫైల్‌చేసి వున్న వుత్తరాల దొంతర అందులోంచి తొంగి చూస్తోంది.

ఒక్క క్షణం దానివైపు చూసింది. ఎంత బుద్ధిహీనంగా రాసిందీ వుత్తరాలు! అందులోనూ ఇలాంటి దరిద్రుడికి– ఎంతో విచారమన్పించిందామెకి. పాతాళంలోకి కుంగిపోతున్నట్టుగా వుంది.

అంతట్లోకే వీధిలోంచి భర్త స్కూటర్ వచ్చేసినట్లుగా ఆగకుండా ఒకటే హారన్‌మోత.

ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చింది మధుమతి.

"ఎవరో – వచ్చినట్టున్నారు?" లోపలికి అడుగుపెట్టబోతూ అన్నాడు ఆదిత్య.

"ఆ... అవును" లేని నవ్వు పెదాలమీదికి తెచ్చుకుంటూ, ఎవరో చెప్పటానికి రానిమాటలు వెదుక్కుంటోంది మధుమతి.


అంతలోనే కల్యాణ్ లేచి,

"ఐయామ్ కల్యాణ్ – నేనూ మీ శ్రీమతి కల్సి చదువుకున్నాం. ఇవ్వాళ మా క్లాస్‌మేట్ ఒకామె కన్పించి, ఈమె ఇక్కడే ఉంటోందని అడ్రెస్ ఇచ్చింది. సరే ఓసారి పలకరిద్దామని ఇలా" అంటూ అందంగా నవ్వాడు.

"హోహ్! గ్లాడ్ టు సీయూ, ఎక్కడా మీరు ఉండేది?" పలకరింపుగా అంటూ అతని ప్రక్కనే సోఫాలో కూలబడి,

"ఏమిటి! మీ క్లాస్‌మేట్‌కి కాఫీ ఏమైనా ఇచ్చావా?" అంటూ భార్య మొహంలోకి చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమె మొహంలో అతను చదవలేనన్ని విచిత్ర విచిత్రమైన భావాలు. రక్తమంతా ఇంకిపోయినట్టుగా తెల్లగా పాలిపోయి కళావిహీనంగా, ఏదో గొప్ప షాక్ తిన్నదాన్లా, బొమ్మలా నుంచున్న భార్యని చూస్తే ఏదోగా అన్పించింది ఆదిత్యకు — ఈ ఎనిమిదేళ్ళ కాలంలోనూ ఎప్పుడూ



ఆమెనా రూపంలో చూడలేదతను. అతని మనసు కలవరపడింది. ఏదో ఆలోచనల్లో పడ్డాడు ఆదిత్య. ఎందుకో కలలోంచి మేల్కొన్నదాన్లా, కొంచెం తేరుకొని, లోపలికి నడిచింది మధుమతి — కిచెన్లోకి వెళ్ళి కాఫీ కలపాలా వొద్దా? అని ఆలోచనలో పడింది.

ఏళ్ళకేళ్ళు కాపరం చేసి, ఎంతగానో కలిసిపోయినా ఏదార్నపోయేవాడో, ఓ చీటీ చూపించి నీ భార్య రాసిందన్నా, ఏగాలో మోసుకొచ్చిన గాసిప్ విన్నా, మగాడికి విచక్షణాజ్ఞానం నశించి, అసూయతో అనుమానంతో భార్యని నిర్దాక్షిణ్యంగా వదులుకోడానికి సిద్ధపడతాడు.

తెలిస్తే భర్త మెడపట్టి బయటికి గెంటేస్తాడు. తెలియకూడదంటే ఆ దుష్టుడికి డబ్బివ్వాలి. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి? ఆమె మెదడులోని నరాలన్నీ చిట్లిపోతున్నట్లనిపించే తీవ్రమైన ఆలోచన.

"ఏం మధూ! కాఫీ కలపలేదా?" కిచెన్‌లోకొచ్చి, నిస్త్రాణగా నుంచున్న మధుమతిని పరీక్షగా చూస్తూ అడిగాడు ఆదిత్య.

లేని సత్తువ తెచ్చుకుని, "ఒక్క నిముషం, మీరు వెళ్ళండి" అంది.

ఏదో నిశ్చయించుకున్నట్లు ఆమె మొహంలో గంభీరత్వం అలుముకుంది.

తనకి చదువుంది. ఉద్యోగం ఉంది. తప్పనిసరైతే లోకమ్మీద తిరగబడి బతగ్గల దమ్ముంది. ఎందుకు భయం? అని ధైర్యం చెప్తుంది.

క్షణంలో కాఫీ కలిపి కప్పులో పోసి, హాల్లోకి పట్టుకెళ్ళింది.

కాఫీ లేక ఏం చేస్తావన్నట్టు విలాసంగా చూస్తున్నాడు కళ్యాణ్ వెనక్కివాలి.

"తీసుకోండి" కళ్యాణ్‌ని ఉద్దేశించి అన్నాడు ఆదిత్య.

చిర్నవ్వుతో ముందుకు వంగాడు కళ్యాణ్ అందుకోడానికి. చిత్రంగా ఆమె భర్తకి అందించింది చేతిలోని కప్పు. ఆదిత్య ఆశ్చర్యంగా చూసాడు.

కళ్యాణ్ మొహం నల్లగా మాడిపోయింది.

"నువ్ మర్యాదగా లేచి వెళ్ళిపోతే పరువు దక్కుతుంది" అతన్నే సూటిగా చూస్తూ కఠినంగా అంది మధుమతి. ఆదిత్యకి అంతా అర్ధమైనట్టుగా అన్పించింది. అనుకోని ఈ తిరుగుబాటుకీ, వూహించని పరిణామానికి నిశ్చేష్టుడయిపోయాడు కళ్యాణ్.

మెల్లగా తేరుకుని "ఈ ఉత్తరాలు" అంటూ బెదిరింపుగా మాట్లాడబోయేంతలో రెండు బలమైన చేతులు అతని కాలర్‌పట్టుకుని గుంజి పైకి లేపాయి చేతిలోని ఫైలు విసురుగా లాక్కుని.

మళ్ళా నా భార్యపేరు తలచినా, ఈ ఛాయల కన్పించినా, చంపేస్తాను — ఎంత ధైర్యంరా నీకు నా ఇంటికొచ్చి రాస్కెల్ అంటూ రౌద్రంగా అతన్ని బయటికి 'గెంటి, తన్నినంత పన్జేసాడు ఆదిత్య — అవమానంగా తలదించుకుని, నల్లబడ్డ మొహంతో కూలిపోయిన గుడారంలా వెళ్ళిపోయాడు కళ్యాణ్. ఏదో మహాద్భుతాన్ని చూస్తోన్నట్లు నుంచున్న మధుమతిని చూసి "అగ్గిపెట్టె ప్లీజ్" అన్నాడు ఆదిత్య.

స్వప్నావస్థలో నడిచెళ్ళింది మధుమతి.

అగ్గిపుల్లవెలిగించి ఫైలు అంటిస్తున్న ఆదిత్య ఆమెకళ్ళకి ఎవరెస్ట్ పర్వతశిఖరంలా అనిపించాడు. ఆమెకళ్ళు చెమ్మతో తడితడిగా అయ్యాయి. మెల్లగా అతనిదగ్గరకెళ్ళి, పక్కన కూర్చుని, భుజమ్మీద తలవాల్చింది.

"ప్రేమ అనే భ్రమలో చేసిన పొరబాటు... మీదెంత గొప్ప మనసు!" కృతజ్ఞతతో గాద్గదికంగా అంది మధుమతి.

"ఇందులో గొప్పే వుంది మధూ! ఇన్నాళ్ళు రాత్రీ, పగలూ నీతో కల్సి అన్నీ పంచుకుంటూ ఇవ్వాళ ఈ కష్టంలో నీకామాత్రం అండగా నిలబడకపోతే ఈ పెళ్ళి, ఈ దాంపత్యం, ఇవన్నీ ఎందుకంటావ్?" అనునయంగా ఆదరణగా అన్నాడు. ఆ కంఠంలో గొప్ప సపోర్ట్, రక్షణ

ఆ వెలుగుతోన్న మంట ఆమెకి బాన్‌ఫైర్‌లా, ఆ గదిలో కమ్ముకున్న చిరువెచ్చదనం భర్త ఇస్తోన్న భద్రతలా అన్పించి తృప్తిగా ఊపిరి తీసుకుంది మధుమతి. *